క్లుప్తంగా

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అబ్దుల్లా, రంగప్ప

కర్నూలు(సెంట్రల్): సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండో శనివారం, ఆదివారాల్లో కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ఆర్యన్, ఆదిత్య, భాస్కర్ పాల్గొన్నారు.

19న హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ సభ



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): జిల్లా హోటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ 5వ వార్షికోత్సవ సభను ఈనెల 19వ తేదీన ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. శనివారం యూనియన్ కార్యాలయంలో వార్షికోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వార్షికోత్సవ సభలో హోటళ్లు, బేకరీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించేలా తీర్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, టి.రామాంజనేయులు పాల్గొన్నారు. నాయకుడు జి.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

దామోదరం మునిస్వామికి నివాళి



మునిస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కుమారుడు దామోదరం మునిస్వామి 22వ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని చేనేత భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్దార్ బుచ్చిబాబు, దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దామోదరం రాధాకృష్ణ హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ...దామోదరం సంజీవయ్య, మునిస్వాములు ప్రజా నాయకులని, వారి చరిత్ర భావితరాలకు తెలియజేసే బాధ్యతను తమ చారిటబుల్ ట్రస్టు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్, సీనియర్ న్యాయవాది మ.ధుసూదన్, భారత కిషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాద్రి పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోండి



ఓటు నమోదుకు సంబంధించిన ఫారాలు పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని నగర పాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల అధికారి రవీంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలో దామోదరం సంజీవయ్య స్కూల్, టౌన్‌మోడ ల్ స్కూల్, మాంటిస్సోరి స్కూల్, చెట్టుకింద బడి, వడ్డగేరి, ఎ.క్యాంపు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజా స్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలు పనిచేస్తాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కేసీకి 2,445 క్యూసెక్కుల నీరు విడుదల

కర్నూలు సిటీ: తుంగభద్ర నదికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి దిగువకు ఒక గేటు పైకెత్తి 2,264 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇప్పటి వరకు 2024-25 నీటి సంవత్సరంలో బ్యారేజీ నుంచి దిగువకు 338 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు జల వనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

గోవిందా..గోవింద

- తిరుమలకు భక్తి చైతన్య పాదయాత్ర ప్రారంభం

కర్నూలు కల్చరల్: తిరుమలకు కర్నూలు నుంచి భక్తి చైతన్య పాదయాత్ర ప్రారంభమైంది. కలియుగ వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు 800 మంది భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ కాలినడకన బయలుదేరారు. యాత్ర ప్రారంభ సందర్భంగా ఓల్డ్‌సిటీలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద చైతన్య రథానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్‌పర్సన్, భక్తిచైతన్య పాదయాత్ర కమిటీ గౌరవ అధ్యక్షురాలు ఎస్వీ విజయ మనోహరి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి ఏటా భక్తి చైతన్య పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర స్వామిని కాలినడకన వెళ్లి దర్శించుకోవడాన్ని భక్తులు అదృష్టంగా భావిస్తారన్నారు. కమిటీ సభ్యులు శివయ్య, మాదన్న, శ్రీనివాసులు, శ్రీరాములు, గురవయ్య, రమణారెడ్డి, సుధాకర్ తదితరులు యాత్ర సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తి చైతన్య రథం యాత్రలో కోలాటాలు, నందికోల, చెక్క భజన, సంకీర్తనల ఆలాపన ప్రత్యేకంగా నిలిచాయి.



భక్తి చైతన్య పాదయాత్ర రథం వద్ద మహిళా భక్తులు



నందికోలతో ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు



పాదయాత్రలో చెక్క భజన ప్రదర్శిస్తున్న భక్తులు

జిల్లా కోర్టులో న్యాయ సేవల దినోత్సవం

కర్నూలు (లీగల్) : జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.ప్రతిభాదేవి మాట్లాడుతూ సమాజంలోని బలహీనవర్గాలకు చట్టపరమైన సేవలు అందించడానికి జాతీయ న్యాయ సేవల దినోత్సవం తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకటహరినాథ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి, ట్రైనీ న్యాయమూర్తులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాదులు, మధ్యవర్తులు, లా స్టూడెంట్స్, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ప్రతిభాదేవి

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం



తలపడుతున్న వైజాగ్, శ్రీకాకుళం జట్లు

కర్నూలు (టౌన్) : ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు తమ వంతుగా ప్రోత్సహిస్తామని బీఆర్‌కే ఫౌండేషన్ సభ్యులు బొల్లెద్దుల ప్రశాంత్ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విశిష్ట అతిథి, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. నిత్య సాధన చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచిందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, పోటీల నిర్వాహకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు పల్నాడు, అన్నమయ్య, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాలు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పరమేశ్వర రెడ్డి, కిరణ్‌కుమార్, సుభాన్ బాషా, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

- ఉర్దూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవంలో జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు కల్చరల్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. శనివారం నగర శివారులోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ స్కిల్స్‌ను పెంపొందించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యురాలు అజ్రా జావెద్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగంలో ఉన్నత హోదాల్లో మహిళలు ఉండటం స్త్రీ శక్తి అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఈసీ మెంబర్స్ జి.ఎం.డి. ఇబ్రహీం, నవీద్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్. షావలి ఖాన్ మాట్లాడుతూ వర్సిటీకి శాశ్వత భవనాల నిర్మాణం, అప్రోచ్ రోడ్స్ నిర్మాణం పనులను ప్రభుత్వ సహకారంతో త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఎంపీజేవీకే కింద ఒకేషనల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు నివేదికలు సమర్పించామన్నారు. వర్సిటీ అభివృద్ధికి కర్నూలు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ మంజూరు చేస్తామన్నారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.లోకనాథ మాట్లాడారు. తకు ముందు పాలక మండలి సభ్యురాలు అజ్రా జావెద్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ప్రేయర్ హాల్, రీడింగ్ రూమ్‌ను అతిథులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



జేసీని సన్మానిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ షావలి ఖాన్, పాలక మండలి సభ్యులు

26న దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను నిరసిస్తూ నవంబర్ 26వ తేదీన చేపట్టే దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కేంద్ర కమిటీ పిలుపు మేరకు నవంబర్ 26వ తేదీన జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో మహా ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల కడుపు కొడుతుందని విమర్శించారు. అన్నదాతకు మద్దతు ధర లభించేలా చట్టం చేయాలని కోరితే తిరస్కరిస్తోందన్నారు. కార్మికులకు ఉన్న చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తేవడంతో బానిసలుగా బతకాల్సి వస్తోందన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణలో విఫలం

కర్నూలు(సెంట్రల్): ఆకాశన్నంటుతున్న నిత్యావసరధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. ఆపార్టీనాయకులు చేపట్టిన ప్రజాపోరు యాత్ర శనివారం రెండోరోజు కొనసాగింది. బృందాలుగా విడిపోయిన సీపీఎం నాయకులు పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఓల్డ్‌సిటీలో నిర్వహించిన పాదయాత్రలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ..అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే చంద్రబాబునాయుడు రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం ప్రజలపై వేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు చార్జీలను పెంచబోనని చెప్పిన ఆయన ఎందుకు పెంచుతున్నారో చెప్పాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిత్యావసర వస్తువులు ధరలు ఏపీలో ఉన్నాయన్నారు. ఏకంగా కేజీ బియ్యం రూ.80 పలుకుతోందన్నారు. లీటర్ మంచినూనె రూ. 200 చేరిందన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గౌస్‌దేశాయ్

ఈ రోజు

రజక కార్తీక మాస వనభోజనాలు

కర్నూలు (అర్బన్) : ఈనెల 10వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రజక కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు, నాయకులు కేతూరు మధు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్థానిక గౌరీగోపాల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కిసాన్ ఘాట్ ఫన్ అండ్ ఫుడ్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న రజక కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీతారాముల కల్యాణ ఉత్సవం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ శ్రీరాముల దేవాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉసిరిక పూజ, ఊంజల్‌సేవ కార్యక్రమాలు జరుగుతాయని భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆయుష్మాన్‌భవ కార్యక్రమం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం ఆధ్వర్యంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆయుష్మాన్ భవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గాడిచెర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. 'వయోవృద్ధులకు ఆరోగ్య సూత్రాలు' అనే అంశంపై కర్నూలు వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుజ్జల భవానీ ప్రసాద్, ×ఐరోపా దేశాల యాత్ర అనుభవాలు₹ అనే అంశంపై ప్రభుత్వ సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లెపోగు నాగరాజు ప్రసంగిస్తారని తెలిపారు.

'సెల్లు పురాణం' శతకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించిన 'సెల్లు (సెల్ ఫోన్) పురాణం' శతకం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్‌మియ్యా తెలిపారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, సత్యసాయి జిల్లా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య అతిథులుగా హాజరై శతకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

వైకుంఠ వాసునికి ఆర్జిత సేవలు

కర్నూలు కల్చరల్: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వైకుంఠ వాసునికి ఉదయాస్తమాన ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి నాగోజీరావు, ఉపాధ్యక్షుడు మహాబలేష్ తెలిపారు. భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

క్రైం కార్నర్

ముస్తఫాపై దాడి నిందితుల అరెస్టు?

కర్నూలు (టౌన్): ఈనెల 3 వ తేదీన వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగానికి చెందిన ముస్తఫాపై దాడి చేసిన ఐదుగురిని మూడో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. స్థానిక రామచంద్ర మిషన్ వద్ద ఐదుగురు వ్యక్తులు ముసుగులు ధరించి బాధితుడిపై దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన అతను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. దాడి ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మహేష్, మంజు, నాగేంద్ర, బాలు, నాగ్ అనే ఐదుగురిని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి పూజలు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసంలో విష్ణువు ఆరాధన, శ్రవణాయుక్త గోపూజ ఎంతో ఉత్తమమని సూర్యనారాయణ స్వామి ఆలయం ఎగ్జిక్యూటివ్ సభ్యులు శివ రామకృష్ణ అన్నారు. శనివారం శ్రీ గురు దత్త ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో భక్తి శ్రద్ధలతో గోపాష్టమి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఆటో ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందు తూ శనివారం మృతి చెందా రు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రా మానికి చెందిన రెడ్డిపోగు శేఖర్ కొడుకు సంతోష్ కు మార్(5) ఈ నెల 8వ తేదీన ఉదయం రోడ్డు దాటుతుండగా అదే సమయంలో ఉయ్యాలవాడ గ్రామా నికి చెందిన బోయ ఆనంద్ తన ఆటో నడుపుతూ ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక మతి చెందారు. మృతుని తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా ఎస్పీ బిందు మాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు (టౌన్): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక కొత్తపేట వద్ద ఆధునీకరించిన ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్‌పై అవగాహన, కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నగరంలో ప్రమాదాలను తగ్గించేందుకు ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రైవింగ్‌లో ఫోన్ వాడటం, మద్యం సేవించడం, ఓవర్ లోడింగ్ వంటివి చేయకూడదన్నారు. ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా ఆటో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటోలను నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపరాదన్నారు. ప్రతి ఆటోకు పోలీసు గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్య కలాపాలు జరిగితే డయల్ 112 లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, కర్నూలు పట్టణ సీఐలు రామయ్య నాయుడు, నాగరాజరావు, మురళీధర్ రెడ్డి, మధుసూదన్‌గౌడ్, పవన్‌కుమార్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లి వ్యాపారుల సిండికేట్

- సరైన ధర లభించక నష్టపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి క్రయవిక్రయాల్లో వ్యాపారుల సిండికేట్ వ్యవహారం జోరుగా సాగుతోంది. వ్యాపారులు సిండికేట్ అవుతుండటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పర్యవేక్షణ లేకపోవడం వల్లనే వారు సిండికేట్‌గా మారి తక్కువ ధరలను కోట్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 7వ తేదీతో పోలిస్తే 8వ తేదీ ఉల్లి ధర తగ్గింది. అయితే సగటు ధర ఏకంగా రూ.4186 నమోదు అయింది. వ్యాపారుల మధ్య పోటీ ఉన్నప్పుడే ధరలు పెరుగుతాయి. 8వ తేదీతో పోలిస్తే 9వ తేదీ గరిష్ట ధర రూ.35 పెరిగి రూ.4,719 లభించింది. ధర పెరిగినప్పటికి మద్దతు ధర రూ. కేవలం 3,583 నమోదు అయింది. వ్యాపారులు సిండికేట్‌గా మారినప్పుడే సగటు ధర తక్కువగా ఉంటుంది. ఏ పంటకైనా సగటు ధరలనే ప్రామాణికంగా తీసుకుంటారు. వ్యాపారులు సిండికేట్‌గా మారినప్పుడు సగటు ధర తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలుస్తోంది. గరిష్ట ధర రూ.4,719 లభించినా... ఎక్కువ మంది రైతులకు రూ.3,500లోపే ధర లభించినట్లు స్పష్టమవుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారుతుండటం వల్లే తమకు గిట్టుబాటు ధరలు లభించకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. వేరుశనగ రైతులు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. క్వింటాలుకు రూ.4,410 వరకు మాత్రమే ధర లభిస్తుండటంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. కనిష్ట ధర రూ.2,673, గరిష్ట ధర రూ.6,100 లభించింది. సగటు ధర రూ.4,410 మాత్రమే నమోదు అయింది.

డాక్టర్ ఖాజి అమతుర్ రహీంకు ఉత్తమ అవార్డు



అమతుర్ రహీం

కర్నూలు కల్చరల్: నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలోని ఉర్దూ శాఖలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఖాజి అమతుర్ రహీం రాష్ట్ర ఉర్దూ అకాడమి వారి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమె గత ఎనిమిది ఏళ్లుగా ఉర్దూ యూనివర్శిటీలో ఉర్దూ అధ్యాపకురాలుగా సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 7 పుస్తకాలు రచించడంతో పాటు 11 పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో ఉత్తమ ఉర్దూ అవార్డును అమతుర్ రహీం అందుకోనున్నారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్, టీచింగ్ స్టాఫ్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్): అదిగో ఇదిగో డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ సీఎం చంద్రబాబునాయుడు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ విమర్శించారు. అధికారంలోకి రాగానే పెట్టిన మొదటి సంతకానికే చంద్రబాబు పంగనామాలు పెట్టారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని ప్రమాణ స్వీకారం రోజు చెప్పారని, ఇప్పటికీ ఆరునెలలవుతున్నా అతీగతీ లేదన్నారు. శనివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం కారణాలు చూపి నోటిఫికేషన్ విడుదలలో మరింత జాప్యం చేసే అవకాశం కనిపిస్తోందన్నారు. డీఎస్సీ పరీక్షను జిల్లా అంతటా ఒకే పేపర్‌తో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, గౌతమ్, హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

చిన్నపిల్లల్లో ప్రవర్తన సమస్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రోజా బంగి

కర్నూలు (హాస్పిటల్) : ఇటీవల కాలంలో చిన్నపిల్లల్లో ప్రవర్తనా (బిహేవియర్) సమస్యలు అధికమయ్యాయని ఆడియాలజిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్ రోజా బంగి చెప్పారు. శనివారం కర్నూలులోని రోజాస్ హియరింగ్ స్పీచ్ బ్యాలెన్స్ అండ్ మల్టీ రిహాబ్ సెంటర్‌లో వినికిడి సమస్యలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా బంగి మాట్లాడుతూ చిన్నపిల్లల్లో బిహేవియర్ సమస్యలు పెరుగుతున్న కారణంగా ఈ సమస్యను ఎదుర్కోవడంలో తల్లిదండ్రుల పాత్ర, ప్రాముఖ్యత, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే బిహేవియర్ థెరపీ ద్వారా తగిన పరిష్కారం అందించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు.

11 నుంచి కార్తీక మాస ధార్మిక ప్రవచన సప్తాహం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక మాసం విశిష్టతపై ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు ధార్మిక ప్రవచన సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓర్వకల్ మండలంలోని శ్రీ జీవేశ్వర స్వామి దేవస్థానం, నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డలోని శ్రీ అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో ధార్మిక ప్రవచకులచే ధార్మిక ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13వ తేదీన కల్లూరు మండలం పర్ల గ్రామం, గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీల్లో శ్రీ లక్ష్మీచెన్న కేశవ స్వామి ఆలయం, నంద్యాల మండలం పొన్నాపురం, ఆళ్లగడ్డలోని ఎస్సీ కాలనీలోని శ్రీ చెన్నకేశవ స్వామి, రామాలయంలో మంగళ కైశిక ద్వాదశి వేడుకలు, 15వ తేదీన ఓర్వకల్, ఆళ్లగడ్డలో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయన్నారు. సామూహికంగా సామూహిక వ్రతం, కార్తీక పౌర్ణమి వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పండితులు విరివింటి ఫణి శశాంక శర్మ, ఓర్వకల్ మండల ప్రముఖులు రాంభూపాల్‌రెడ్డి, వెంకట కృష్ణయ్య, గోవిందరెడ్డి, భాస్కర్ రెడ్డి, రామిరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.